# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 89 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 20 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 89 20-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





**పోరాడి డిప్యూటీ మేయర్ సాధించిన జనసేన**

కూటమిలో కొత్త వివాదం..!

2 లో..

## ఆంధ్రలో త్వరలోనే..
# నంది అవార్డుల ప్రదానం



అమరావతి మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులు తిరిగి పునరుద్ధరించబోతున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. సినీ రంగానికి ఉత్సాహాన్నిచ్చే ఈ ప్రకటన, 'భైరవం' సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన చేసిన కీలక వ్యాఖ్యల్లో భాగంగా వెలువడింది.

**ఓ చలనచిత్ర వేడుకలో ప్రకటన-సినిమా రంగానికి ప్రోత్సాహకంగా నంది అవార్డులు**

ఆదివారం సాయంత్రం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమం, సినిమా ప్రమోషన్‌కు మించి, ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర రంగానికి ఓ ఉత్సాహాన్ని నింపింది. ప్రముఖ నటులు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రలలో నటించిన 'భైరవం' చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ– రాబోయే రోజుల్లో విశాఖపట్నంని కూడా చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చేయటానికి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చాలా కాలంగా నంది అవార్డులను మరుగునపడేశారని, తిరిగి పునరుద్ధరించి అతి త్వరలోనే పురస్కారాలను అందజేస్తామన్నారు. త్వరలోనే చిత్ర పరిశ్రమ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి స్టూడియోల నిర్మాణాలు, డంబింగ్, రీరికార్డింగ్ చేయటంలో నిర్మించడానికి సపోర్ట్ ఇవ్వటానికి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫిల్మ్ పాలసీ తీసుకురావడానికి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన భౌగోళిక, ప్రకృతిసౌందర్య వనరులను ఉపయోగించి, సినిమా షఉటింగ్స్ సులభంగా జరగేలా చేయడమే లక్ష్యంగా తీసుకుంటున్నారు. నంది అవార్డులు పునరుద్ధరణతో, తెలుగు సినిమా మరియు టెలివిజన్ రంగంలో ఉన్న ప్రతిభావంతులకు గుర్తింపు లభించనుంది. గతంలో నంది అవార్డులు చెయ్యని విధంగా రాజకీయ కారణాల వల్ల మూడేళ్లు నిలిపివేయబడ్డాయని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు వాటిని తిరిగి ప్రారంభించడం కళారంగానికి గౌరవాన్ని తిరిగి తీసుకురానుంది.భైరవం సినిమా సూపర్ హిట్ కావాలని మంత్రి దుర్గేష్

- తరువాయి 2లో..



# ఆశ్రయం ఇచ్చేందుకు భారత్ ధర్మశాల కాదు
## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మన దేశంలో ఆశ్రయం కోరుతూ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. అసలేం జరిగిందంటే..**



నిషేధిత సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయని ఆరోపణలతో 2015లో శ్రీలంకకు చెందిన ఓ వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2018లో అతడిని దోషి తేలుస్తూ 10 ఏళ్ల శిక్ష ఖరారు చేసింది.

**మొసలి కన్నీళ్లా.. కర్నల్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రికి సుప్రీం చీవాట్లు**

అనంతరం ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. శిక్షను ఏడేళ్లకు తగ్గిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే,

- తరువాయి 2లో..

# విశాఖ స్టీల్‌లో ప్రమాదం
## 300 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు



విశాఖపట్నం, మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదం చోటుచేసుకుంది. ఫలితంగా బ్లాస్ట్‌ఫర్నేస్–2లో సుమారు 300 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలైంది. ఫర్నేస్ నుంచి టర్పో ల్యాడిల్ కార్‌లోకి (టీఎల్‌సీ) ద్రవ ఉక్కును నింపి, ఎస్ఎంఎస్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో ఒక్కసారిగా టీఎల్‌సీకి రంధ్రం పడి ద్రవ ఉక్కు కిందపడిపోయింది. ఈ ఘటనలో కేబుల్స్ కాలిపోయి, ట్రాక్ దెబ్బతింది. ఎలాంటి ప్రాణనష్టం

- తరువాయి 2లో..

## బైడెన్ త్వరగా కోలుకోవాలి మోడీ పోస్ట్



న్యూఢిల్లీ మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమెరికా మాజీ అధ్యక్షుడు జోబైడెన్ ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా బైడెన్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోరుకోవలని ఆకాంక్షించారు. 'అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఆరోగ్య పరిస్థితి గురించి విని ఆందోళన చెందాను. ఆయన త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని మోడీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతుంది.

## మాతృమూర్తులకు శుభవార్త..
# ఎన్టీఆర్ బేబి కిట్లు పథకం పునరుద్ధరణ

- మిగతా 2 లో..




## తొలిసారిగా ట్రాన్స్ జెండర్లకు
# రేషన్ కార్డులు

అమరావతి మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మరో కీలక మైలురాయి నమోదైంది. తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు రేషన్ కార్డులు జారీ చేయనుండటాన్ని పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ ప్రకటించారు. కాకినాడలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పక్కకు నెట్టబడిన ట్రాన్స్‌జెండర్ సమాజానికి సమాన హక్కులు కల్పించడంలో ఇది కీలక నిర్ణయమని చెప్పారు.




**ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి న్యాయం**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తోట సుధీర్ పేర్కొన్నారు. రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే పౌరసరఫరాల లబ్ధిని ట్రాన్స్‌జెండర్

2 లో..

# జన్యుపరమైన వ్యాధులపై అవగాహన

- ఏపీని అగ్రస్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష!
- వ్యాధులను ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం
- బాధితులకి క్రమం తప్పకుండా ఉచిత రక్త మార్పిడి చేస్తున్నాం

అమరావతి మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న వ్యాధులను ముందుగా గుర్తించడం





చాలా ముఖ్యం అని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ నిర్వహిస్తామని మంత్రి సత్యకుమార్ చెప్పారు. ఈరోజు విజయవాడలో మంత్రి సత్యకుమార్ మీడియాతో మాట్లాడారు.

'ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే ఏపీని అగ్ర స్థానంలో నిలపాలన్నదే నా ఆకాంక్ష.

రాష్ట్రంలో 1900 మంది హిమోఫీలియా

- తరువాయి 2లో..

## జంగారెడ్డిగూడెంలో మరణాలపై
# స్పెషల్ టాస్క్‌ఫోర్స్

అమరావతి మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 2022 మార్చిలో కల్తీ మద్యం కారణంగా చోటు చేసుకున్న మరణాలపై లోతుగా దర్యాప్తు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక టాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఏలూరు ఎస్పీ కిశోర్ నేతృత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ఈ బృందంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వేణు ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఉంటారు. కల్తీ మద్యం కారణంగా చోటు చేసుకున్న మరణాలకు సంబంధించి జంగారెడ్డి గూడెం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు వేర్వేరు




- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## ఇండియా ఇంత బలహీనమైనదా?

**ఈ మధ్య కాలంలో ప్రపంచం యుద్ధాల భూమిగా మారింది. గత నాలుగేళ్ళుగా ఉక్రెయిన్ %-% రష్యా యుద్ధం తీవ్ర విధ్వంసానికి దారి తీసింది. ఏడాదిన్నర నుండి ఇజ్రాయెల్ %-% పాలస్తీనా యుద్ధం భీకర నష్టానికి కారణమైంది. ఏప్రిల్ 22న అమా యక భారతీయులను కశ్మీర్‌లో టెర్రరిస్టులు దారుణంగా హత్య చెయ్యడంతో దేశం ఉడికిపోయింది. మే 7న పాక్‌లోని టెర్రరిస్టు క్యాంపు మీద ఇండియా దాడి చేసింది. అది ఒక మినీ వార్‌కు దారి తీసింది. అందులో రెండు యుద్ధాలు టెర్రరిస్టులు అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడంతో మొదలయ్యాయి. ఒకటి భూభాగ సమస్యగా మొదలైంది.**

**టెర్రరిజంపై యుద్ధాలు**

గత కొన్ని దశాబ్దాలుగా టెర్రరిస్టులు ప్లాన్ చేసి అమాయక ప్రజలను చంపడంతో దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయి. అవి దేశాలను సైతం ధ్వంసం చేయడానికి దారి తీస్తున్నాయి. ఇప్పుడు ఇండియా%-%పాకిస్తాన్ మధ్య అటువంటి టెర్రరిస్టు దాడి వల్ల నాలుగు రోజులు కాల్పులు జరిగాయి. చివరికి మే 12న విరమణ జరిగింది. అయితే దీన్ని ఇండియా%-%పాకిస్తాన్ అధికారులు ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదీ యుద్ధం విరమించకపోతే ఈ రెండు దేశాలతో వ్యాపార సంబంధాలు ఉండవని చెప్పాననీ, అందువల్ల వారు వెంటనే ఆపడానికి అంగీకరించారనీ అన్నారు. ఇది చాలా తీవ్రమైన ప్రకటన.

అంతేకాదు, ఆ రెండు దేశాలు ఒక తటస్థ ప్రదేశంలో కశ్మీర్ సమస్యను చర్చించి, పరిష్కరించుకోవడానికి అంగీకరించారని కూడా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అంతటితో ఆగకుండా ఆ రెండు దేశాల మధ్య అణుయుద్ధం జరిగే ప్రమాదాన్ని ఆపానని కూడా అన్నారు. ట్రంప్ ప్రకటనలు పాక్ కంటే ఎక్కువగా ఇండియాను ఇరకాటంలో పెట్టాయి. అయితే పాక్ కూడా ట్రంప్ మధ్యవర్తిత్వానికి పాకులాడి ఎందుకు లొంగిపోయిందని చైనా నిలదీస్తున్నది. చైనా పాకిస్తాన్‌కు చాలా ఆయుధాలను ఇచ్చిందనేది తెలిసిందే. ఈ నాలుగు రోజుల ఇండియా%-%పాకిస్తాన్ ఉద్రిక్తతలు... చైనా, యూరప్, అమెరికా ఆయుధాల అమ్మకపు మార్కెట్ బలాబలాలను మార్చేసింది అనే చర్చ ప్రపంచమంతటా జరుగుతోంది.

**దౌత్య విలువలను మంటగలిపిన ట్రంప్**

ట్రంప్ భారత ప్రభుత్వానికి దగ్గరి మిత్రుడని బీజేపీ, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ట్రంప్ రెండోసారి గెలిచాక భారత్‌ను అవమానపరిచే అనేక ప్రకట నలు చేస్తున్నారు, చర్యలు తీసుకుంటున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ప్రధాని మోదీ వాషింగ్టన్ పర్యటనలో ఉండగానే మన దేశ పౌరులను అక్రమ వలసదారులు అనే నెపంతో చేతు లకు బేడీలు వేసి, మిలిటరీ విమానంలో చండీగఢ్ విమానాశ్రయంలో వదిలారు.

అలాగే ఇండియా%-%పాక్ రెండు దేశాలనూ అవమానపరిచేలా, ఆయా ప్రభుత్వాలు ప్రజలకు చెప్పకముందే తాను చేయబట్టే యుద్ధం ఆగిపోతోంది అని ట్వీట్ చేశారు. ఇది అన్ని విధాలుగా అంతర్జాతీయ దౌత్య విలువలకూ, యుద్ధ నీతికీ వ్యతిరేకం. ఆయా ప్రభుత్వాలు చెప్పాల్సిన విషయమది. ప్రపంచంలో ఏ రెండు దేశాల మధ్య యుద్ధం జరిగినా దాన్ని ఆపేందుకు అటు ఐక్యరాజ్యసమితి(యూఎన్ఓ), లేదా ఇతర దేశాలు రాయబారాలు జరిపి రెండు దేశాలనూ ఒప్పించి యుద్ధం ఆగేట్లు చూడటం దౌత్య నీతిలో భాగమే.

అందులో ఇండియా%-%పాక్ న్యూక్లియర్ ఆయుధాలు కలిగి ఉన్న దేశాలు కనుక ప్రపంచ దేశాలన్నీ ఈ యుద్ధం ఆపాలని చూడటం అవసరం. కానీ మొన్న యూఎన్ఓ ఎక్కడా కనిపించలేదు. అది నిజానికి ఉక్రెయిన్ %-% రష్యా, ఇజ్రాయెల్ %-% పాలస్తీనా యుద్ధాలను ఆపడానికి కొన్ని ప్రయత్నాలు చేసింది. కానీ, ఇండియా%-%పాక్ ఉద్రిక్తతల సమయంలో దాని ఉనికి కనిపించలేదు. యూరోపియన్ దేశాలు కూడా ఇండియా%-%పాక్ ఉద్రిక్తతలను ఇజ్రాయెల్%-%పాలస్తీనా యుద్ధంలాగా ఘోరంగా అమాయక ప్రజలను టెర్రరిస్టులు చంపడంతో మొదలైనా పెద్దగా పట్టించుకోలేదు. రష్యా కూడా బహిరంగంగా ఇండియాకు మద్దతు పలుకలేదు. చైనా, టర్కీ, ఇరాన్... పాకిస్తాన్‌కు అండగా ఉన్నాయనేది స్పష్టంగానే కనిపించింది.

వీటన్నింటినీ మించి యూఎస్, ముఖ్యంగా ట్రంప్ పాత్ర అన్ని యుద్ధ సమయపు దౌత్య విలువలనూ నాశనం చేసింది. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ కొద్ది రోజుల ముందే ఇండియా వచ్చి మిత్రగానం చేసి 'ఆ యుద్ధంలో జోక్యం చేసుకోవడం మా పని కా'దన్నాడు. కానీ పాక్‌కు 2.3 బిలియన్ డాలర్లు ఐఎంఎఫ్ ద్వారా ఇప్పించారు. పైగా ట్రంప్ కశ్మీర్‌ను మళ్ళీ చర్చల తెర మీదకి తెచ్చి ఒక తటస్థ స్థలంలో 'వెయ్యి ఏండ్ల' సమస్యగా ఉన్న కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తామనడం, కాల్పుల విరమణను వాణిజ్య లావాదేవీలతో ముడిపెట్టి ప్రకటించడం చూస్తే, అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశాన్ని తన డొమినియన్ స్టేట్‌గా భావిస్తున్నట్టు కనబడుతుంది.

**ఈ ప్రశ్నలకు జవాబుందా?**

భారతదేశం నుండి అమెరికా వెళ్ళి చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులు వేల కోట్ల రూపాయలు అక్కడ ఫీజులుగా చెల్లిస్తున్నారు. వారికి వర్క్ పర్మిట్‌లో 3%-%5 సంవత్సరాల వరకు వీసాలిచ్చి వారినందరినీ ట్రంప్ దిక్కులేని వారిగా చేశారు. అక్కడి నాణ్యత లేని విద్యా సంస్థల్లో కూడా భారతీయ విద్యార్థులు చేరింది ఉద్యోగం ఆశతో! ఒక ప్రభుత్వ కాలంలో నిర్ణయాలు మార్చుదల్చుకుంటే రాబోయే విద్యార్థులకు మార్చాలి. కానీ ఆయన గెలిచే నాటికే ఆ దేశంలో ఉన్న విద్యార్థుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. విచిత్రమేమంటే భారత ప్రభుత్వం వీటి మీద అంతర్జాతీయ విధానాలతో, చట్టపరమైన విధానాలతో అమెరికాను నిలదీసింది లేదు.

పైగా కాల్పుల విరమణ పేరుతో ట్రంప్ ఈ దేశం పరువు తీశారు. ఇటువంటి డిప్లమాటిక్ ఇమ్మోరాలిటీని ఈ దేశం ఎదిరించలేదా? భారతదేశం ఇంత బలహీనమైనదా? జాతీయవాదం, ఆత్మగౌరవం అని చెప్పే, బలమైన ఆర్థిక వ్యవస్థగా యుద్ధశక్తిగా ఎదుగుతున్నామని చెప్పే బీజేపీ/ఆరెస్సెస్ ట్రంప్‌కు ఎందుకు భయపడుతున్నాయి? అమెరికా మద్దతు లేకపోతే దేశం బతకలేదు అనే స్థితి ఎందుకొచ్చింది? భారతదేశంలోని పెద్ద వ్యాపారులందరికీ అమెరికన్ ఆర్థిక పెట్టుబడులతో ఉన్న అనుబంధంతో ఈ స్థితి వచ్చిందా? అయినా ఈ సంక్షోభ సమయంలో అమెరికా, ముఖ్యంగా ట్రంప్ పాకిస్తాన్‌కే ఎక్కువ మేలు చేసినట్టు కనిపించింది కదా! టెర్రరిజాన్ని పోషించే పాక్‌కు ఇన్ని దేశాలు మద్దతు ఇస్తున్నాయి అంటే అర్థమేమిటి? గత పదేళ్ళుగా బీజేపీ/ఆరెస్సెస్ గ్లోబల్ డిప్లమసీలో మన దేశాన్ని గొప్ప స్థానంలో పెట్టామని చెబుతూ వచ్చాయి కదా! అమెరికాలోని ఆరెస్సెస్ అనుబంధ సంస్థలు ట్రంప్‌కు ఎంతో సపోర్టు చేస్తూ వచ్చాయి కదా! మరి ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఏ ఇతర దేశ పౌరుల్నీ మన పౌరుల్లాగా చేతులకు బేడీలు వేసి యుద్ధ విమానాల్లో వెనక్కి పంపలేదే! ఆఖరికి పాక్ అక్రమ వలసదారులకు కూడా ఆ స్థితి వచ్చిన దాఖలాలే లేవే! ఇప్పుడు బీజేపీ/ఆరెస్సెస్ 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్‌ను సంపూర్ణంగా దేశంలో విలీనం చేశామని చెబుతుంటే ట్రంప్ ఆ సమస్యను మళ్ళీ ప్రపంచ సమస్య చేశారు కదా! ఇది కూడా ఆరెస్సెస్/బీజేపీ అనుకూల అంశమేనా? ఇది కూడా ఈ దేశ సమగ్రతను కాపాడే చర్చయేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా?

## ఇజ్రాయిల్ తాజా దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ వైమానిక దాడికి 22 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని రెస్క్యూ సిబ్బంది సోమవారం తెలిపారు. ప్రధానంగా ఈరోజు గాజాలో దక్షిణ ప్రధాన నగరమైన ఖాన్ యూనిస్‌తోపాటు చుట్టుపక్కల ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల వల్ల 11 మంది మృతి చెందారని, అనేమంది గాయాలపాలయ్యారని పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహమూద్ బస్సాల్ తెలిపారు. అలాగే అబాసాన్‌లో మరొకరు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. జబాలియా పట్టణానికి పశ్చిమాన ఉన్న మార్కెట్ సమీపంలో జరిగిన వైమానిక దాడిలో ఐదుగురు మృతి చెందారు. గాజా మధ్యలో ఉన్న నుసెయిరాట్‌లో ఉన్న గుడారంపై వైమానిక దాడికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఉత్తరాన ఉన్న గాజా నగరంలో జరిగిన దాడికి ఒకరు చనిపోయారు. ఇదిలా ఉండగా గాజ స్ట్రిప్ అంతటా దాడులకు పాల్పడుతున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం సోమవారం వెల్లడించింది.



## పోరాడి డిప్యూటీ మేయర్ సాధించిన జనసేన

### కూటమిలో కొత్త వివాదం..!

**గంగవరం కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు ఖరారు.. - అధికారికంగా ప్రకటించిన జనసేన అధిష్టానం..**

<ins>విశాఖపట్నం మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)</ins>

**గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక పూర్తి అయినా.. డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలో కూటమి పార్టీలు సుదీర్ఘ కసరత్తు చేయాల్సి వచ్చింది.. అయితే, మేయర్ టీడీపీకి, డిప్యూటీ మేయర్ జనసేనకు అనే ఓ ప్రచారం జరిగినా.. రెండు పోస్టుల కోసం టీడీపీ నేతలు పట్టుబడుతూ వచ్చారు.. అయితే, ఎట్టకేలకు %+ఎవీజ% డిప్యూటీ మేయర్ పదవిని పోరాడి సాధించింది జనసేన పార్టీ.. గంగవరం కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరును డిప్యూటీ మేయర్‌గా ఖరారు చేసింది జనసేన అధిష్టానం.. అయితే, జనసేన డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకున్నా.. ఇప్పుడు కూటమిలో కొత్త వివాదం మొదలైంది..**



జనసేనకు డిప్యూటీ మేయర్ కేటాయింపుపై టీడీపీ ఆశావహులు గుస్సు మంటున్నారు.. బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో ఈ పరిస్థితిపై హాట్ హాట్ డిస్కషన్ జరిగిందట.. తమను మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారట టీడీపీ ఆశావహులు.. మరోవైపు.. కూటమిలో డిప్యూటీ మేయర్ ఎంపిక పై కొత్త వివాదం మొదలైనట్టుగానే తెలుస్తోంది.. సమన్వయ సమావేశం నుంచి అలిగి వెళ్లిపోయారు రెండు సామాజికవర్గాలకు చెందిన అసంతృప్త కార్పొరేటర్లు%ౌ% అంతేకాదు, బీచ్ రోడ్ లోని ఒక హొటల్ లో సమావేశం అయ్యారట.. డిప్యూటీ మేయర్ ఎన్నిక కు హాజరవ్వడంపై తర్జనభర్జన పడుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది.. ఇప్పటికే కార్పొరేషన్ కు ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చేరుకున్నారు.. మరి కూటమి కార్పొరేటర్లు హాజరు అవుతారా? డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఇంకా ఎలాంటి పరిణామాలు చోటుచేసు కోనున్నాయి? అనేది ఇప్పుడు కూటమి పాలిటిక్స్‌ను కాకరేపుతోంది.

## ఆంధ్రలో త్వరలోనే.. నంది అవార్డుల ప్రదానం

ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కథనాయకులు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్, నిర్మాత రాధా మోహన్, సహ నిర్మాత శ్రీధర్, కథానాయికలు అతిథి శంకర్, నందిని, నటుడు అజయ్, మంత్రి కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్? కుమార్, ఎమ్మెల్మేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, అంబికా సంస్థల అధినేత, నిర్మాత అంబికా కృష్ణ తదితరులు హాజరయ్యారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ట్రైలర్?ను విడుదల చేశారు. తొలిసారిగా ఏలూరులో ఇంత పెద్ద ట్రైలర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది.

## ఆశ్రయం ఇచ్చేందుకు భారత్ ధర్మశాల కాదు

శిక్ష పూర్తి కాగానే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు.

దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. "ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.

## విశాఖ స్టీల్‌లో ప్రమాదం

### 300 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు

లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేసి ట్రాక్ మీద పడిన ఉక్కును, ల్యాడిల్ కార్‌ను తొలగించే పనులు చేపట్టారు. కాగా.. టీఎల్‌సీకి ఇటీవలే రిఫ్రాక్టరీ లైనింగ్ వేసి సిద్ధం చేశారు. అది సుమారు 1,050 హీట్ల వరకు పని చేయాల్సి ఉండగా, 500 హీట్లకే రంధ్రం పడిపోవడంతో లైనింగ్ పనుల్లో నాణ్యత కొరవడిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిపుణులైన సిబ్బందితో పనులు

చేయించాలని స్టీల్‌ఇంటక్ అధ్యక్షుడు పి.వి.రమణమూర్తి, సీటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

## తొలిసారిగా ట్రాన్స్ జెండర్లకు రేషన్ కార్డులు

కమ్యూనిటీకి కూడా అందించాలనే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది సమాజంలో వారి గుర్తింపును బలపరిచే చర్యగా పరిగణించబడుతోంది.

**రేషన్ కార్డులు జారీ చేయడంపై కృతజ్ఞతలు**

ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు తోట సుధీర్‌ను సన్మానించి, తమకు రేషన్ కార్డులు జారీ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితాల్లో ఇదొక పెద్ద ముందడుగు అని, ఇతర ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములయ్యే మార్గం ఇదే అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని కొనియాడుతూ గౌరవం తెలిపారు.

## జన్యుపరమైన వ్యాధులపై అవగాహన

బాధితులున్నారు. 2100 మంది తలసీమియాతో, ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారు. జన్యుపరంగా, వారసత్వంగా వస్తున్న ఈ వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. బాధితులకి క్రమం తప్పకుండా ఉచిత రక్త మార్పిడి చేస్తున్నాం. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, 10 లక్షల 50 వేల మందికి స్క్రీనింగ్ చేశారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారు, 2100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నాం. నోడలాఫిసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఓరియెంటేషన్ జరుగుతుంది' అని మంత్రి సత్యకుమార్ చెప్పారు.

## జంగారెడ్డిగూడెంలో మరణాలపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్

కేసులు నమోదయ్యాయి. కల్తీ మద్యం కారణంగా దాదాపు 22 మంది అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

### మాతృమూర్తులకు శుభవార్త..

## ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ

<ins>అమరావతి మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)</ins>

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్టీఆర్ బేబీ కిట్ పేరుతో ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం అయిన తల్లులకు కిట్లు అందించనున్నారు. 2016లో ఈ ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం ప్రారంభించారు. అయితే 2019 తరువాత బేబీ కిట్ పథకం ఆగిపోయింది. బేబీ కిట్ పథకంలో ఏమేమి ఉంటాయి.. బేబీ కిట్‌లో దోమతెర, దుప్పటి, స్లీపింగ్ బెట్, యాంటీసెప్టిక్ లోషన్‌తో పాటుగా నాప్‌కిన్, డైపర్లు, షాంపూ వంటి 11 రకాల సామాగ్రి ఉంటుంది. ఈ కిట్‌లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఉచితంగా అందజేస్తారు. దీనికోసం 51 కోట్ల 14 లక్షల 77 వేలు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కిట్ కు 1410/- ఖర్చు పెట్టనుంది ప్రభుత్వం

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
మే 20,
మంగళవారం 2025



# మొసలి కన్నీళ్లా.. కర్నల్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రికి సుప్రీం చీవాట్లు



**ఆర్మీ అధికారిణి కర్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విషయంలో ఆయన క్షమాపణలను అంగీకరించలేమన్న అత్యున్నత న్యాయస్థానం.. మంత్రి వ్యాఖ్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరపాలని ఆదేశించింది. అయితే, ప్రస్తుతానికి ఆయన అరెస్టుపై స్టే విధించింది.**

"క్షమాపణలు ఎక్కడ చెప్పారు? ఎలా చెప్పారు? సారీ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారు. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో మీ క్షమాపణ ఎలాంటిది. ఏదో న్యాయస్థానం అడిగింది కాబట్టి చెబుతున్నా అన్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏంటీ?" అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు.

"మీరో ప్రజాప్రతినిధిగా ఉన్నారు. అలాంటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతీ పదాన్ని ఆచితూచి మాట్లాడాలి. మీ వీడియోను మేం చూశాం. చాలా అభ్యంతరకరంగా మాట్లాడారు. మీ వ్యాఖ్యల పట్ల యావత్ దేశం సిగ్గుపడుతోంది" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం మంగళవారం ఉదయం 10 గంటల్లోపు సిట్‌ను ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. రాష్ట్రానికి చెందని ముగ్గురు ఐపీఎస్‌లు అందులో ఉండాలని, వారిలో ఒకరు ఎస్పీ ర్యాంక్ కలిగిన మహిళా అధికారి ఉండాలని సూచించింది. అయితే, ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన కోర్టు.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.

పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆమెను విజయ్ షా 'ఉగ్రవాదుల సోదరి'గా పేర్కొనడంపై దుమారం రేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు.. ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఆయన క్షమాపణలు చెప్పాలని గత విచారణలో న్యాయస్థానం ఆదేశించింది.

# శశిథరూర్‌పై వేటు వేద్దామా.. వద్దా ?

## భాజపా అస్త్రంతో ఎటూ తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్..!




ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాల్లో ఒకదానికి కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ నాయకత్వం వహిస్తున్నారు. కాంగ్రెస్ అధినాయకత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తోన్న వేళ.. కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బాధ్యత అప్పగించడం కాంగ్రెస్‌కు ఏ మాత్రం మింగుడుపడటం లేదు. ఆయనపై వేటు వేయాలా.. వేచి చూద్దామా? అని హస్తం పార్టీలో తర్జనభర్జనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

పాక్‌ను ఎండగట్టే దౌత్యబృందంలో కేంద్రం అన్ని పార్టీల సభ్యులకు చోటు కల్పించింది. ఎంపీలను ఎంపిక చేసే క్రమంలో రాజకీయ పార్టీల సిఫార్సులను కూడా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పరిగణనలోకి తీసుకుంది. శశిథరూర్ పేరును కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించకపోయినా కమిటీలోకి తీసుకున్నారు. పేర్లు ప్రతిపాదించాలని తమను కోరి, పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా థరూర్ పేరును ప్రకటించడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇదొక్కటే కాదు.. ఇటీవల ప్రధాని మోదీ కేరళ పర్యటనలో భాగంగా ఒకే వేదికపై ఈ ఇద్దరు నేతలు కనిపించారు. "ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొంతమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది" అని మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారమూ జరిగింది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ థరూర్ చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### అమెరికాకు థరూర్ బృందం

థరూర్ పార్టీలోనే కొనసాగుతూ.. భాజపా చెప్పినట్లుగా ఆడుతున్నాడని హస్తం పార్టీ అనుమానిస్తోంది. 2026లో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో ఈ తిరువనంతపురం ఎంపీ వ్యవహారశైలితో పార్టీకి నష్టం జరగకముందే.. ఆయనపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రం ఆ బాధ్యతలు అప్పగించగానే ఆయన అంగీకరించడం, కనీసం కాంగ్రెస్ ప్రస్తావన తేకపోవడం రుచించలేదని తెలుస్తోంది. కానీ.. పార్టీ పూర్తి సందిగ్ధతలో ఉంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ విషయాల్లో కేంద్రానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. ఇలాంటి సమయంలో థరూర్‌పై వేటు వేస్తే, భాజపా చేతికి ఆయుధాలు ఇచ్చినట్లు అవుతుందని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే ఆయన వెళ్తున్నది పార్టీ అప్పగించిన పనిమీద కాదు కదా! ఆయన మీద వేటు వేయడానికి ముందు.. ప్రస్తుతానికి ఆయన భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలను ఓ కంట కనిపెట్టాలని సూచిస్తున్నారు. కొన్నేళ్లుగా కీలక నేతలను కోల్పోతున్న కాంగ్రెస్‌కు ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది.

# ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం..

# 6 కి.మీ. ఎత్తుకు ఎగసిన బూడిద

## ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం బద్దలైంది



పడాంగ్:

**తూర్పు ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవొటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతం నుంచి దాదాపు 6 కి.మీ ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసిపడుతున్నట్లు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.**

### బ్రూక్లిన్ వంతెనను ఢీకొన్న మెక్సికో నౌక

"అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నాం" అని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతంలో బూడిద ఇప్పటికీ ఎగసిపడుతోందని.. పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని ఇండోనేసియా జియోలాజికల్ ఏజెన్సీ అధిపతి ముహమ్మద్ వాఫిద్ పేర్కొన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే అగ్నిపర్వతం చుట్టూ ఉన్న ప్రాంతాలకు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు.

# పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్..

# గీత కూడా పడనివ్వని భారత ఆర్మీ

**ఆపరేషన్ సిందూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు.**



మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. "పాక్‌కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు" అని మేజర్ జనరల్ వెల్లడించారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. మన ఎస్-400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్ట్రన్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.

# హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్ : సుప్రీం

**కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండడంపై తాజాగా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇందులోభాగంగా.. హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ పూర్తిస్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగంలో చేరిన తేదీ, ఇతర విషయాలతో సంబంధం లేకుండా మాజీ న్యాయమూర్తులకు పెన్షన్ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయమూర్తులకు, అన్ని జిల్లాల న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు సమానంగా ఉండాలని స్పష్టం చేసింది.**



న్యాయవ్యవస్థకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయమూర్తుల జీతాల మాదిరిగానే, పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు కూడా ఒకేరకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి అభిప్రాయం వ్యక్తంచేశారు. శాశ్వత, అదనపు న్యాయమూర్తుల మధ్య ఎటువంటి తేడాను చూపకూడదని పేర్కొన్నారు. వితంతువులు, ఇతర ఆధారపడిన వారికి గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలు కూడా అందరు న్యాయమూర్తులకు ఒకేరకంగా అందించాలన్నారు.

టెర్మినల్ ప్రయోజనాల కోసం పదవీవిరమణ తర్వాత న్యాయమూర్తుల మధ్య ఎటువంటి వివక్ష చూపినా అది ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లు అవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అందువల్ల అన్ని హైకోర్టుల న్యాయమూర్తులు.. వారు ఎప్పుడు ప్రవేశించారనే దానితో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులని అన్నారు. ఇకపై అన్ని హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులకు సంవత్సరానికి రూ.15 లక్షల పెన్షన్.. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులకు రూ.13.5 లక్షల పూర్తి పెన్షన్ చెల్లించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 20 మే 2025

# మినీ మహానాడుకి తరలి వెళ్ళిన టీడీపీ నేతలు



**పోలవరం, మే 19(తెలుగు రాష్ట్రం విలేకరి):** ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్, ఏపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం పంచాయ తీ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ట్రైకార్ చైర్మన్ టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా 1983 సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పార్టీని స్థాపించి కేవలం ఎనిమిది నెలల కాలంలోనే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారన్నారు. పార్టీకి కార్యకర్తలే మూల స్థంభాలని ఆనాటి నుండి నేటి వరకూ పార్టీ కోసం శ్రమించి పార్టీని పార్టీ పట్ల అభిమానాన్ని వీడక అహర్నిశలూ శ్రమిస్తున్న కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తకి ఏ కష్టమొచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చంద్రబాబు, లోకేశాబాబుల నాయకత్వంలో నియోజకవర్గ ఇంచార్జిగా తాను సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీలో విస్తృత సేవలందించిన వారికి కచ్చితమైన గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో కొయ్యలగూడెం తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ, యువజన నాయకులు ఆకుల రాజా, ఎస్సీ సెల్ నాయకల యడ్ల వినోద్, పొట్నూరి నారాయణరావు, కంభంపాటి గోపి తదితర నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా గ్రీవిన్స్ కు 43 దరఖాస్తులు



**రంపచోడవరం, మే 19 (తెలుగు రాష్ట్రం విలేకరి):** ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాల అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఈవారం 43 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తి స్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం. రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డిఎల్ డివో కె. కోటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీడి బి. సత్యనారాయణ, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రవి కుమార్, ఎంపీడీవో యస్. శ్రీనివాస రావు దొర, సిడిపిఒ సంధ్యారాణి, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ కె.సావిత్రి, వెలుగు ఏపిడి దేగలయ్య, ఎడియం%డ%హెచ్ఓ జి.శిరీష డిప్యూటీ తాసిల్దారులు జిలాని, త్రిమూర్తులు, శ్రీధర్, స్వామి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, చైతన్య, సాయి సతీష్, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లికార్జునరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, సబ్ కలెక్టర్ వారి కార్యాలయ పరిపాలన అధికారి రమణి, డిడి ఆఫీస్ సూపర్డెంట్ బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రయోజనాలకు ఎన్డీఏ ధ్యేయం.

## -ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు సందర్భంగా కొత్తపేట కాపు కళ్యాణమండపంలో సోమవారం నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాలు నియోజకవర్గంలో 56,789 సభ్యులు నమోదు అయ్యిందని. 262 బూత్‌లకు కన్వీనర్లు, కో-కన్వీనర్లు నియామకం చేసామని. 51 యూనిట్ ఇన్‌ఛార్జులు, 10 క్లస్టర్ ఇన్‌ఛార్జులు. 57 గ్రామాలలో పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు నియామకం. అనుబంధ సంఘాలలో తెలుగు మహిళ, యువత, బిసి సెల్, ఎస్సీ సెల్, రైతు విభాగాలకు బాధ్యతలు జరిగాయని తెలిపారు. తీర్మానాలు 1. కొత్తపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి. 2. ఆలమూరు ఆసుపత్రికి 50 పడకల స్థాయి. 3. నేషనల్ హైవేలో కాలువ గట్టు రోడ్డును త్వరగా పూర్తి చేయాలి. 4. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్. 5. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ల ఆలస్యం లేకుండా ఇవ్వాలి. 6. కాపులకు 5% రిజర్వేషన్ అమలు. 7. 2014-19లో పెండింగ్ బిల్లుల విడుదల. 8. రావులపాలెంలో ట్రూమో సెంటర్, టూరిజం క్లస్టర్ అభివృద్ధి. 9. వాడపల్లి దేవస్థానాన్ని కేంద్ర స్కీమ్‌లో చేర్చాలి. 10. ఉచిత మహిళా బస్సు సర్వీస్‌పై హర్షం వ్యక్తం చేశారు. సంతాపం: గడచిన సంవత్సరం మరణించిన పార్టీ నేతలైన పున్నపు బూరయ్య, దొమ్మేటి గోపాలం, మైగాపుల బాబ్జి తదితరులకు నివాళులు అర్పించారు. పార్టీ అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు పూర్తిచేసి మహానాడు లోపు వెల్లడిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వాడపల్లి వెంకన్నకు రూ. 22 లక్షల విలువగల బంగారు, వెండి పాత్రలు బహుకరణ.



**ఆత్రేయపురం: మే 19, (తెలుగు రాష్ట్రం విలేకరి):** కోనసీమ తిరుమల, ఏడు వారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 209.84 గ్రాముల బంగారు పంచపాత్రలు, 318.84 గ్రాముల వెండి పళ్ళెం సుమారు రూ.22 లక్షల రూపాయల విలువ చేసే వస్తువులు సోమవారం భక్తులు సమర్పించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట వాస్తవ్యులు పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలినాళ్లలో కొత్తపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు కీ.శే. మంతెన సుబ్బరాజు వారసులు వెంకట కృష్ణంరాజు దుర్గావతి దంపతులు వారి కుమారులు వెంకట సూర్య సుబ్బరాజు, శ్వేత దంపతులు సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని శ్రీ స్వామివారికి 22 లక్షలు రూపాయలు విలువ కలిగిన బంగారు పంచ పాత్రలు, వెండి పళ్ళెం సమర్పించారు. దాతలకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# యువ నేతల ఆవిర్భావం. కొత్తపేటలో టీడీపీకి తాజా నియామకాలు.









**కొత్తపేట: మే 19 (తెలుగు రాష్ట్రం విలేకరి):** కొత్తపేట నియోజకవర్గంలో టీడీపీకి ఒక కొత్త దిశ, కొత్త ఊపిరి. నాలుగు మండలాలకు నూతన అధ్యక్షుడు నియామకం. మినీ మహానాడులో ఎమ్మెల్యే బండారు సత్యనందరావు నేతృత్వంలో తీసుకున్న నిర్ణయాలు యువత ఆశలు అర్థవంతం చేస్తున్నాయి. చిత్తశుద్ధితో, స్పష్టమైన లక్ష్యంతో పార్టీని గ్రామ స్థాయిలో గట్టి చేయాలనే సంకల్పంతో నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు నూతన నాయకత్వాన్ని ఇవ్వడం జరిగింది. ఈసారి ప్రత్యేకత ఏంటంటే, అధ్యక్ష పదవులు మొత్తం యువతకు కేటాయించడం. ఇది పార్టీ భవిష్యత్ పట్ల ఉన్న నమ్మకాన్ని, అభిముఖతను చూపిస్తోంది. ఆత్రేయపురం మండలాన్ని ముందుకు నడిపించేందుకు బాధ్యత తీసుకున్నారు కూసంపూడి రామకృష్ణ రాజు (బాబు). ఆలమూరులో యువ నాయకుడు ఈదల సత్తిబాబుకు లభించింది. రావులపాలెంలో కొప్పిశెట్టి ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. కొత్తపేట మండలంలో గనిశెట్టి వీరేష్ ను పార్టీ ఎంపిక చేసింది. ఈ నియామకాల నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు సత్యనందరావు మాట్లాడుతూ, "పార్టీ ఒక కుటుంబం లాంటిది. అందరూ కలిసిమెలిసి పని చేస్తేనే నిజమైన విజయం సాధ్యమవుతుంది" అన్నారు. మండల అధ్యక్షులు గ్రామ స్థాయి నాయకులతో గట్టి సంబంధాలు ఏర్పరచు కోవాలని, విభేదాలకు చోటు లేకుండా చూసుకోవాలని సూచించారు. అధ్యక్షులుగా ఎంపికైన వారిని ఆయా మండలాల్లో కార్యకర్తలు, అభిమానులు ఘనంగా అభినందించారు. ఈ యువ నాయకత్వం, పార్టీ శక్తిని కొత్త ఎత్తుకు తీసుకెళ్లుతుందనే నమ్మకంతో కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# కొత్తపేటలో ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి




**కొత్తపేట, మే 19, (తెలుగు రాష్ట్రం విలేకరి):** కొత్తపేట బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెదాడు. ఎస్సై జి. సురేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన గంధం నాగేశ్వరరావు (37) కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను బంధువుల పెళ్లికి కొత్తపేట శివాలయంకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే రాత్రి 10:45 సమయంలో అతను కొత్తపేట బస్టాండ్ వద్ద నిలబడి ఉండగా అమలాపురం నుండి రావులపాలెం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న బంధువులు బండారు దుర్గారావు, బండారు పుల్లేశ్వరరావు తదితరులు అతడిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య గంధం దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేంద్ర తెలిపారు.

# క్రాప్ హాలిడే ప్రకటించిన పేరూరు రైతులు..



**అమలాపురం, మే 19, (తెలుగు రాష్ట్రం విలేకరి):** కలెక్టర్ కార్యాలయం ఎదుట పేరూరు గ్రామ రైతులు నిరసన దర్శన చేశారు. పంట కాలువ లాకులకు తలుపులు మార్చకపోతే పేరూరు గ్రామమంతా క్రాప్ హాలిడే ప్రకటిస్తా%శీ% అని పేరూరు రైతులు నినాదాలు చేశారు. పేరూరు కుమ్మరి కాలువ లాకులు తలుపులు పాడైపోవడం వల్ల వరి పంట నష్టం వాటిలుతుందని పేరూరు గ్రామస్థుల, రైతు సంఘం అధ్యక్షులు దేగల వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కీ రైతులు వినతిపత్రం అందజేశారు. గతంలో చాలాసార్లు అధికారులు దృష్టికి రాజకీయ నాయకులు దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పరిష్కారం చూపలేదని లాకులు తలుపులు పాడైపోవడం వల్ల ఉప్పు నీటి పోటు అధికంగా వచ్చి వరి పంట తీవ్రంగా నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేసిన రైతులు..

# రావులపాలెంలో వాడపల్లి వెంకన్న ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన



**రావులపాలెం, మే 19, (తెలుగు రాష్ట్రం విలేకరి):** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్లో ముఖద్వార నిర్మాణానికి సోమవారం శంఖుస్థాపన చేసారు. కళా వెంకట్రావు విగ్రహ సమీపంలో ఊబలంక వైపు వెళ్ళే రోడ్డు ప్రారంభంలో ముఖద్వారం నిర్మాణానికి దాత సి.ఎం.ఆర్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ దంపతులు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యం సత్తాకు నిదర్శనం 'ఆపరేషన్ సిందూర్'

## - ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే సత్యానందరావు- రావులపాలెంలో ఎన్డీఏ కూటమి తిరంగా ర్యాలీ



**రావులపాలెం, మే 19,(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పహల్గాంలో అమాయకులైన పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను మట్టు పెట్టేందుకు ఇటీవల భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఇండియా సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఇండియన్ ఆర్మీకి మద్దతుగా అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి శ్రేణులు తిరంగా యాత్ర నిర్వహించారు. ముందుగా స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గానికి చెందిన ఐదుగురు రిటైర్డ్ సైనికులను ఘనంగా సత్కరించారు. ఇండియా పాకిస్తాన్ మధ్య జరిగిన దాడుల్లో మృతి చెందిన మురళీ నాయక్ తదితర అమరవీరులకు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సత్యానందరావు ఎంపీ హరీష్ మాధుర్, జనసేన పార్టీ ఇన్చార్జి బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, బీజేపీ ఇన్చార్జి అయినవిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా తదితర కూటమి నాయకులు, వివిధ వర్గాల ప్రజలతో కలిసి స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా కళా వెంకట్రావు సెంటర్ వరకు త్రివర్ణ పతాకాలు, ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల త్యాగాలకు జోహార్లు అర్పిస్తూ భారత్ మాతా కీ జై.. వందేమాతరం.. జై భారత్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.వి.సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, కాసా విజయసాగర్, తమనంపూడి రామకృష్ణారెడ్డి, కేతా శ్రీనివాస్, కంఠంశెట్టి శ్రీనివాస్, సలాది రామకృష్ణ, గుబ్బల మూర్తి, ముత్యాల బాబ్జి, రాకేష్ వర్మ, బూసి జయలక్ష్మి, పాలూరి సత్యానందం, పొనుగుపాటి శ్రీనివాస్, గంద్రోతు వీర గోవిందరావు, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.





తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
మే 20,
మంగళవారం 2025



## ఆలపాటి రామచంద్రరావు శత జయంతి మహోత్సవాలు.





**ఏలూరు, మే 19,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం (వై.ఎం.హెచ్. ఏ) మరియు హేలాపురి కళా పరిషత్ ఆధ్వర్యంలో మే 17,18,19,20 తేదీలలో నాలుగు రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు రెండవ రోజు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రివర్యులు కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంబికా రామచంద్రరావు వారి కుటుంబ సభ్యుల సేవలు,కృషి అభినందనీయమని,ఏలూరుకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం అందరికీ గర్వకారణం అన్నారు. అతిథులుగా ఆర్.టి.సి. విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ మంత్రి మరడాని రంగారావు, ప్రముఖ సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్, హిందూ యువజన సంఘం మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ కళారత్న కె.వి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, సెక్రటరీ మజ్జి కాంతారావు తదితరులు పాల్గొన్నారు. రెండవ రోజు మొదటి ప్రదర్శనగా గోవాడ క్రియేషన్, హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ",రెండవ ప్రదర్శనగా కృష్ణా ఆర్ట్స్ మరియు కల్చరల్ అసోసియేషన్,గుడివాడ వారి ద్వారాబంధాల చంద్రయ్యనాయుడు నాటికలు అలరించాయి.ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త,భాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ గౌరవ ఫెల్లో ప్రొఫెసర్ డాక్టర్ వెల్చేరు నారాయణరావు కి 11వ తానా–గిడుగు రామమూర్తి తెలుగు భాషా పురస్కారాన్ని తానా నాయకులు గొర్రిపాటి చందు, వి.ఎల్.ఎం.ఆర్.వెంకటరావు లు అందించారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన నాయకులు నారా శేషు, అంబికా ప్రసాద్,వేణు గోపాల్ లునాని, మోతే శ్రీనివాస నారాయణరావు, ఆర్.ఎన్.ఆర్. నాగేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, కె.బి.రావు, ఎస్.సురేష్, డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ యాదవ్,మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ,అంబికా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.. మహమ్మద్ కాజావలి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**-పి జి ఆర్ ఎస్ లో 248 అర్జీలు రాక -జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ఏలూరు, మే 19,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం,పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొని ప్రజల నుంచి 248 అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు,ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ లో వచ్చిన వినతులను ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని పరిష్కరించ వలసిందిగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పలు సమస్యలతో కూడిన అర్జీలను సమర్పించారు.వాటిలో కొన్ని అర్జీలు ఇలా ఉన్నాయి.చింతలపూడి మండలం గొల్లగూడెం గ్రామ నివాసి. మానికల సోవమ్మ.మా భూమి చింతలపూడి ఎత్తిపోతల పథకం,పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు మా 13 సెంట్లు భూమి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో చూపిస్తుంది. కాని ఆర్థిక సహాయం అందలేదని మా భూమి పూర్తి వివరాలు తెలియపర్చగలని కోరారు, టి.నరసాపురం మండలం కేతవరం గ్రామ నివాసులు. మోర్ల కనకరాజు,మోర్ల వెంకటేశ్వర రావు.మా భూమి వెబ్ ల్యాండులో నమోదు చెయ్యాలని కోరారు, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామ నివాసి.గోలి లక్ష్మిరెడ్డి పంటపొలాలు దగ్గర గ్రీన్ హైవే రోడ్డు పనులలో డ్రైనేజీ సరిగ్గా లేకపోవుట వలన వరదనీరు వలన పెద్దగండి పడింది.దానిని మేము పూడ్చుట ఖర్చుతో కూడుకున్నది కావున ఆ గండిని పూడ్పించి పంట పొలాలను కాపాడగలరని కోరారు.ఉంగుటూరు మండలం ఏ.గోకవరం గ్రామ నివాసి.సజ్జా సూర్యవీర వెంకట సత్య లక్ష్మినారాయణ.మా గ్రామ పంచాయతీకి చెందిన టేకు,మామిడి తదితర మొక్కలు అక్రమంగా నరికివేస్తున్నారు.విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎండార్స్‌మెంట్‌లు అందించడంపై దృష్టి సారించాలి

**-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మే 19(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా అందచేసిన అర్జీల విషయంలో ఫిర్యాదు దారుకు ఎండార్స్మెంట్లు అందడం లేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ అధికారి సీతారామమూర్తి, ఇతర అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆడిట్ నివేదిక ప్రకారం 50 శాతం మంది ఫిర్యాదుదార్లకు ఎండార్స్మెంట్ చేరడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని, ఇటువంటి ఫిర్యాదులు రాకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ విధాలుగా వస్తున్న అర్జీలను స్వీకరించడం, వాటికి ఎండార్స్మెంట్ తప్పక ఇవ్వాలని, సంబంధిత ఫిర్యాదుదారుకు చేరేలా శ్రద్ధ వహించాలని సూచించారు. ఫిర్యాదుల్లో రెవెన్యూ, సర్వే శాఖలకు చెందినవి అధికంగా ఉన్నాయని, తర్వాతి స్థానాల్లో పోలీస్, పంచాయతీ రాజ్, పురపాలక శాఖలు ఉన్నాయని తెలియజేశారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేయాలని, తద్వారా ఫిర్యాదు పై సమగ్ర అవగాహన పొందవచ్చని సూచించారు. కొన్ని సమస్యలను ఎంపీడీవో, తహసిల్దార్, ఎస్‌హెచ్ఓతో కూడిన మండల స్థాయి కమిటీకి నివేదిస్తున్నట్లు తెలిపారు. పరిష్కారం చూపలేని అంశాలకు కారణాలు తెలపాలని లేకుంటే సీఎమ్ఓ నుంచి వీటిపై పదేపదే ఆదేశాలు వస్తూనే ఉంటాయని తెలియజేశారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను (ఆర్టిఫిషియల్ లింబ్) కలెక్టర్ పి ప్రశాంతి అందజేశారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సమకూర్చిన 25వేల రూపాయలు విలువైన ఈ కృత్రిమ అవయవాలను ముగ్గురు మహిళలు, ఒక పురుషునికి కలెక్టర్ చేతుల మీదుగా అందచేశారు. పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, డిఆర్వో టి సీతారామ మూర్తి, సిపివో ఎల్ అప్పల కొండ, డీఆర్డిఏ పిడి ఎన్‌వివిఎస్ మూర్తి, ఇంచార్జీ డిఎస్వో ఎమ్ఆర్ఆర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

**-కమిషనర్ కేతన్ గార్గ్**



**రాజమహేంద్రవరం, మే 19(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వ సేవలు పొందేందుకుగానూ ప్రతి పౌరుడు హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం సంక్షేమ పథకాల కోసమే కాకుండా.. ఆదాయ, కుల పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్యాక్స్ పేమెంట్, ల్యాండ్ రిజిస్ట్రేషన్లు వంటి ఎటువంటి సేవలు పొందాలన్నా హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి అని పేర్కొన్నారు. కనుక తెల్లరేషన్ కార్డుదారులతో పాటు ఇతర కార్డుదారులు, ఆర్థికంగా ఉన్నత వర్గాల వారు కూడా మ్యాపింగ్ చేయించుకోవలసిందిగా కోరారు. ప్రభుత్వ సేవలు పొందడటం ప్రతి పౌరుడి హక్కు అని.. మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసుకోవడం ద్వారా మీ హక్కును మీరే కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలో నివసించే ప్రజలు ముందుకువచ్చి.. ప్రభుత్వ సేవల లబ్ధిని కోల్పోకుండా ఇప్పుడే మీమీ పరిధిలోని సచివాలయ కార్యాలయాలను సంప్రదించాలని

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



**టీ. నర్సాపురం, మే 19 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

టీ. నర్సాపురం మండలం ఏ ఎస్ ఆర్ నగర్ కాలనీలో ప్రజల ప్రియతమ నేత దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రావు, మాట్లాడుతూ సుందరయ్య, ఆదర్శమూర్తి శత్రువులతో సైతం కొనియాడబడిన నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని ఆయన ఆశయాలపై అడుగుజాడలలో నడిసి ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలోమండల కమిటీ సభ్యులు మురళి, మడకం కుమారి, శిరీష, బరగడ కుమారి తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

## మలేరియా ప్రబలకుండా ప్రతి గ్రామంలో పాగింగ్ చేయాలి

**-ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం**

**రంపచోడవరం, మే 19(తెలుగురాష్ట్రం విలేకరి):**



ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా ప్రతి గ్రామంలో పాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల పంచాయతీ పరిధిలో గ్రామాలలో మలేరియా ప్రబలకుండా దోమల నిర్మూలించే విధంగా ఎక్కడికక్కడ పాగింగ్ చేయించాలని ఆయన అన్నారు. ప్రతి పంచాయతీ సచివాలయాల పరిధిలో పాగింగ్ మిషన్లు రిపేర్లు ఉన్న వాటిని వెంటనే రిపేర్లు చేయించాలని ఆయన అన్నారు. ఏజెన్సీ అన్ని గ్రామాలలో నీటి గుంటలు ఉన్న వాటిని గుర్తించి ఆయా ప్రాంతాలలో తప్పనిసరిగా పాగిని చేయించాలని అదేవిధంగా అన్ని మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, గ్రామసచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో పాగింగ్ చేయించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహించిన అధికారులను సిబ్బందిని శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఏజెన్సీ ఏడు మండలాలలో అన్ని గ్రామాలలో రక్తహీనత ఉన్న వారిని గుర్తించేందుకు డాక్టర్ స్పందన పర్యవేక్షణలో వైద్యాధికారులు హరికృష్ణ, సాయి రతన్, కెవిన్, నాగార్జునను ఒక టీమును ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో రక్తహీనత ఉన్న వారిని అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు వైద్యాధికారులను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**-సిటీలోని ఈద్గా, ముస్లీం బరియల్ గ్రౌండు అభివృద్ధికి ప్రత్యేక కృషి -నూతన కమిటీలు ముస్లింల అభ్యున్నతికి పాటుపడాలి -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్ష**

**రాజమహేంద్రవరం, మే 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**



మైనారిటీల సంక్షేమానికి... అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) అన్నారు. రాజమండ్రి సిటీలో వక్ఫ్ ఆస్తుల్కైన ఈద్గా, ముస్లీం బరియల్ గ్రౌండు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వీటిని అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈద్గా, ముస్లిం బరియల్ గ్రౌండుకు అధికారికంగా మంచి కమిటీలను నియమించినట్లు సోమవారం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వెల్లడిరచారు. ఆయా కమిటీలకు అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లాతో కలిసి నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరంలోని ముస్లిం బరియల్ గ్రౌండును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అక్కడ అధ్వానంగా అడవిలా తయారై ఉందని, అక్కడకు కార్యక్రమాల కోసం వెళితే పది నిమిషాలు ఉండలేని దుస్థితి నెలకొందని అన్నారు. రెహమత్ నగర్ షాదీఖానాకు శంకుస్థాపన చేసినా గత ఐదేళ్లు వైసీపీ ప్రజాప్రతినిధులు వాటిని పూర్తి చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తి చేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పుడు ఈద్గా ఆవరణ, ముస్లీం బరియల్ గ్రౌండుకు నూతన కమిటీలు నియమించామని ఆ కమిటీల ఆధ్వర్యంలో ఇవి అభివృద్ధి చెందడంతో పాటు కమిటీ సభ్యులు ముస్లీం సోదరుల అభ్యున్నతికి పాటుపడతారని వాసు ఆకాంక్షించారు. ముస్లీం బరియల్ గ్రౌండులోని మొక్కలు, తుప్పలను తొలగించేందుకు, అభివృద్ధి చేసేందుకు కమిటీని నియమించి వారికి బాధ్యత అప్పగించాలని నిర్ణయించామని ఆయన చెప్పారు. గతంలో వైసీపీ పాలనలో అన్నీ గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. రెహమత్ నగర్ షాదీఖానాకు నిధులు కూడా మంజూరై శంకుస్థాపన కూడా చేస్తే నిర్మాణం చేయకుండా ఐదేళ్ళు గాలికి వదిలేశారని విచారం వ్యక్తం చేశారు. ఇలా అనేకమైనవి ఉన్నాయని, ఇప్పుడు ఒక్కొక్కటిగా చేసుకు వస్తున్నామని వివరించారు. మసీదులు, షాదీఖానాల అభివృద్ధికి గతంలో శాంక్షన్ అయిన జీవోలను నిధులను మళ్ళీ పొందడానికి తిరిగి శాంక్షన్ చేయిస్తామని, ఆ జీవోలను తిరిగి బతికిస్తామని స్పష్టం చేశారు. మైనారిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నూతన కమిటీల నాయకులు వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలనికోరారు. కమిటీల్లో నియమితుల్కైన ముస్లీం నాయకులు అబ్దుల్లా, అస్లాం మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని, ఈద్గా, ముస్లీం బరియల్ గ్రౌండు అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. తమను ఈ కమిటీల్లో నియమించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు కూటమి ప్రభుత్వానికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బషీర్, మహబూబ్ జానీ, మహబూబ్ ఖాన్, ఖాన్ బాబు, అప్సరి, అహ్మదున్నీసా, జనసేన లిమ్రా బాషా, బషీర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈద్గా కమిటీ అధ్యక్షుడుగా సయ్యద్ ఆదిల్ పాషా, ఉపాధ్యక్షుడుగా సయ్యద్ మహబూబ్ హుస్సేన్, కార్యదర్శిగా ఎండి ఆరీఫుద్దీన్, కోశాధికారిగా ఎండి మొహరం, సభ్యులుగా ఎస్‌కె అబ్దుల్ రెహమాన్, ఎండి షబ్బీర్ బాషా, ఎస్‌కె జాఫర్ మొహీద్దీన్, సయ్యద్ కరీముల్లా, షేక్ ఆదిల్ బాషాలు నియమితులయ్యారు. బరియల్ గ్రౌండు కమిటీ అధ్యక్షుడిగా ఎస్‌కె అమీర్ రాజా, ఉపాధ్యక్షుడుగా యండి నజీరుల్లా ఖురేషి, కార్యదర్శిగా సయ్యద్ మదీనా, కోశాధికారిగా ఎస్‌కె ఖలీషా, సభ్యులుగా ఎస్.కె.మదీనా సాహెబ్, యండి అబ్దుల్ సత్తార్ బాషా, ఎస్‌కె ఉస్మాన్, ఎండి అప్సర్ ఖాన్, యండి తస్లీం ఖురేషి, యండి సలీం, యండి మునార్ ఖురేషి నియమితులయ్యారు

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రోషన్



**చింతలపూడి, మే 19(తెలుగు రాష్ట్రం విలేఖరి):**

చింతలపూడి పట్టణంలో ఎం.డి.ఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే రోషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.సి. కార్పొరేషన్ ద్వారా 90 రోజుల ఉచిత కుట్టు శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చింతలపూడి టౌన్ లో 60 మందికి, మండలం లో 60 మందికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణానంతరం ఉచిత కుట్టుమిషన్లు అందిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**జగ్గయ్యపేట, మే 19 (తెలుగురాష్ట్రం విలేకరి):**

జగ్గయ్యపేట పట్టణములోని “బి కన్వెన్షన్”లో సోమవారం ఉదయం 10 గంటల నుండి నందిగామ డివిజన్ పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమమును ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ నిర్వహించారు. నందిగామ డివిజన్ లోని మండలాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం జగ్గయ్యపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా స్థాయి లో అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని నందిగామ డివిజన్ ప్రజలు కూడా సద్వినియోగం చేసుకున్నారు. ప్రతి సోమవారం పీ.జీ.ఆర్.ఎస్. కార్యక్రమాన్ని విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతోందని, నందిగామ డివిజన్ ప్రజల సౌకర్యార్థం సమీపంలోనే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి అర్జీల స్వీకరణ ప్రారంభించారు. నందిగామ డివిజన్ తోపాటు మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా అర్జీలు సమర్పించారు. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో కూడా అర్జీలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అర్జీలు రాయుట, నమోదు చేయుట, వాటికి టోకెన్ నంబర్లునిచ్చుటకు కేంద్రాలను అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ పంచాయతీ వారు స్టాల్లను పెట్టి చెత్త నుండి సంపద తయారీ, వర్మీ కంపోజ్ విక్రయ కేంద్రాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమమునకు జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టం రఘురామ్, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్, రెవిన్యూ డివిజినల్ అధికారి, నందిగామ వారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం వినతి



**జగ్గయ్యపేట, మే 19 (తెలుగురాష్ట్రం విలేకరి):**

జగ్గయ్యపేట పట్టణం బి-కన్వెన్షన్ హాల్ నందిగామ రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కి ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపియంపిఏ) జగ్గయ్యపేట కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని అర్జిని యూనియన్ నేతలు ఇచ్చారు. ఏపియంపిఏ అధ్యక్షులు కాకరపర్తి రమేష్, కార్యదర్శి గడ్డం రాంబాబు కలెక్టర్ తో మాట్లాడుతూ కొత్త అక్రిడేషన్ కార్డులను ఈ నెలాఖరు లోగా ఇవ్వాలని, జర్నలిస్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాలకు 20 కి.మీ.ల పరిధిలో పట్టణాలకు ఉచిత ప్రయాణం కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా 1/3 చార్జీతో ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కి సరిహద్దు గా తెలంగాణ ప్రాంతం ఉంది. ఏ.పి.యస్. ఆర్.టి.సి బస్సులలో సరిహద్దు రాష్ట్రంలో సుమారు 25 కిలోమీటర్ల మేర ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఆగిపోయిన రైల్వే పాస్ లను వెంటనే పునరుద్దరించాలని కోరారు. పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు, పక్కా గృహాలు అంద చేయాలని, జగ్గయ్యపేట పట్టణంలో మరియు మండలాల కేంద్రాల పరిధిలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం కోసం మరియు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళటం కోసం మీడియా పాయింట్ కోసం స్థలాన్ని కేటాయించాలని, అవసరమైన భవనాలు ఇతర సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల హెల్త్ స్కీం ద్వారా విజయవాడ లో గల ప్రైవేటు హాస్పిటల్స్ లో వారి కుటుంబానికి ఉచిత ట్రీట్మెంట్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కార్పోరేట్ మరియు ప్రైవేటు స్కూల్స్, కాలేజిలలో ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు వృత్తి అవసరాల నిమిత్తం ప్రోత్సాహకాలుగా ప్రభుత్వం సబ్సిడీ తో కూడిన రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాలని, 50 సం.లు నిండి, అనుభవం ఉన్న సీనియర్ జర్నలిస్టు లకు ఫించన్ సౌకర్యాని కల్పించాలని కోరారు. జర్నలిస్టుల వాహనాలకు ఉచిత టోల్ గేట్ సౌకర్యాన్ని కల్పించాలని, మరణించిన జర్నలిస్టు కుటుంబాని కి మట్టి ఖర్చుల నిమిత్తం 25,000 రూపాయలను, చంద్రన్న భీమా ద్వారా రెండు లక్షల రూపాయలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపియంపిఏ జిల్లా కార్యదర్శి కళ్యాణపు సూర్య ప్రకాశ రావు, జిల్లా సభ్యులు యం మల్యాద్రి(వంశీ), జిల్లా పిఆర్ఓ మెటికల శ్రీనివాసరావు,స్థానిక కమిటీ సభ్యులు బేతు రంగా, తాళ్ళూరి దుర్గారావు, శ్రీ రామ్ సింగ్, కరిసే మధు తదితరులు పాల్గొన్నారు.


# సుందరయ్య ఆశయ సాధనకు అంకితమవుదాం



**వి.ఆర్.పురం, మే19(తెలుగు రాష్ట్రం విలేకరి):**

దక్షిణ భారతదేశంలో సి.పి.ఎం, పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. వారారామచంద్రాపురం,రాజీవ్ గాంధీ సెంటర్లో ఉన్నటువంటి పుచ్చలపల్లి సుందరయ్య,స్థూపంవద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ హాజరయ్యారు.సీనియర్ నాయకులు కుంజానాగిరెడ్డి,చేతుల మీదుగా జండాఆవిష్కరించి, నివాళులర్పించడం జరిగింది. అనంతరం రేఖపల్లి పార్టీ కార్యాలయంనందు ఏర్పాటు చేసినటువంటిసభలో పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య,అడుగుజాడల్లో నేటి యువతరం నడవాలని,సూచించారు.ఆస్తులు ఉన్నాఅన్నీవదులుకొని పేద ప్రజలకుసేవ చేయాలని సంకల్పం తో బీజంవేసి తనజీవిత ప్రయాణం కొనసాగించారని,ఆమహనీయుని ఆశయాలసాధనకై కార్యకర్తలు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు,ఎం.పి.పి,కారం లక్ష్మి, ఎం.పి.టి.సి పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ కారం బుచ్చమ్మ,వెట్టి లక్ష్మి, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్ , కమ్మసిచ్చు సత్యనారాయణ, చీరపు తాతబాబు రెడ్డి, పోడియం శ్రీరామ్మూర్తి, జల్లిసత్యనారాయణ,పులి బొజ్జి, కాంతారావు, రాజు, ప్రకాష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# విరాజిల్లు అగ్ని పూల చెట్లు



**“ దేవరపల్లి,మే19, (తెలుగు రాష్ట్రం విలేకరి):**

దేవరపల్లి మండలం విరాజిల్లుతున్న అగ్ని పూల చెట్లు మండలంలో లక్ష్మీపురం దేవరపల్లి కరుటూరు ఫంక్షన్ హాల్ వద్ద చిన్నాయగూడెం రామనపాలెం లక్ష్మీపురం కురుకూరు పల్లంట్ల గ్రామాలలో రోడ్ల ప్రక్కన అగ్ని పూల చెట్లు ఆకర్షిస్తున్నాయి ముఖ్యంగా వాహన చోదకులు ప్రయాణికులు ఈ పూలను చూసి ముచ్చట పడుతున్నారు ఈ చెట్టుకు ఆకుల తక్కువ పువ్వులు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు సెల్ఫీలు ఫోటోలు తీసుకుంటున్నారు గతంలో ఈ పూల చెట్లు రోడ్ల ఇరుపక్కల ఎక్కువగా ఉండేది రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని చెట్లు కనుమరుగయ్యాయి రమణీయమైన ఈ చెట్లు సోయోగాలతో కనువిందు చేస్తున్నాయి ముఖ్యంగా ఈ చెట్లు సినిమా చెకింగ్ లో ఎక్కువగా కనపడే దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు గ్రామీణ ప్రాంతంలో ఈ చెట్లు ఎంతో ఆకరాభంగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి ఆకర్షించే ఈ అగ్నిపూల చెట్లను రైతులు కూడా తమ పొలంకట్లపై వేసి వాతావరణ సమతుల్యం పాటించడానికి రైతులు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం.





**అల్లవరం, మే 19(తెలుగు రాష్ట్రం విలేకరి):**

అల్లవరం మండలం తూర్పులంక గ్రామంలో పిడుగు పాటుకు గురై ఇళ్ళు దగ్ధమై సర్వసం కోల్పోయిన మందా పెదసత్యనారాయణ మరియు చినసత్యనారాయణ కుటుంబ సభ్యులకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఛార్టిబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం మరియు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఛార్టిబుల్ ట్రస్ట్ గోడిలంక వారి సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల, దుస్తులు మరియు రూ 5 వేల నగదు అందించడమైనది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు, ఎంపీపీ ఇళ్ళ శేషారావు, సర్పంచ్ కదలి గంగాచలం,ఉప సర్పంచ్ కాశి కరుణాకరరావు, కట్టా శ్రీను, సింహాద్రి, యలమంచిలి రమేష్ పాల్గొన్నారు.

# కడియం కోఆప్షన్ సభ్యుడిగా షేక్ బాజ్జీ ఎన్నిక

## -ఈసారి జనసేన పార్టీకి అవకాశం





**కడియం,మే19(తెలుగు రాష్ట్రం విలేకరి):**

కడియం మండలం పరిషత్ కోఆప్షన్ సభ్యులు గా కడియపుసావరం గ్రామానికి చెందిన షేక్ బాజ్జీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గతంలో టిడిపి పార్టీ నుంచి మాదవరాయడుపాలెం (చైతన్య నగర్)కు చెందిన కోఆప్షన్ సభ్యులు షేక్ వల్లీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆయన ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల కావడం తో ఈ స్థానాన్ని జనసేనపార్టీ కి కేటాయించాలని కూటమి నేతలు నిర్ణయించారు.కూటమి అభ్యర్థి గా జనసేన పార్టీ కి చెందిన షేక్ బాజ్జీ ని ఎంపిక చేశారు. ఈనేపథ్యంలో కడియం మండలం పరిషత్ కార్యాలయంలో బాజ్జి సోమవారం ఉదయం ఎన్నికల అధికారి (ఆర్ డబ్ల్యూ ఎస్ ఇఇ) గిరి కి నామినేషన్ దాఖలు చేశారు.మండల పరిషత్ పాలకవర్గం లో మెజారిటీ సభ్యులు కూటమి పార్టీ కి చెందిన వారు కావడం తో కోఆప్షన్ సభ్యుడిగా షేక్ బాజ్జీ ఎన్నిక లాంచన ప్రాయంగా జరిగింది. అయితే ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి ఎవరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో సోమవారం మధ్యాహ్నం ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత కోఆప్షన్ సభ్యులుగా జనసేన పార్టీకి చెందిన షేక్ బాజ్జీ ఎన్నికైనట్లు ఎలక్షన్ అధికారి గిరి, ఎంపీడీవో కే.రమేష్ ప్రకటించారు. అనంతరం బాజ్జి ప్రమాణ స్వీకారం చేశారు.కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన షేక్ బాజ్జిని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు గట్టి నరసయ్య,సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, బిజెపి రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, మండల జనసేనపార్టీ, టిడిపి అధ్యక్షులు ముద్రగడ జమ్మి, వెలుగుబంటి నాని, నాగిరెడ్డి రామకృష్ణ, ఆదిమూలం సాయిబాబా,వరగోగుల సత్యనారాయణ,చెన్నా శ్రీను, జనసేన పార్టీ వీర మహిళ బోడపాటి రాజేశ్వరి, కలిదిండి గోవిందు, చిలుకూరు నాగేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి కో ఆప్షన్ పదవి కేటాయించిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి లకు సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ కడియపు సావరం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటిఎస్ విధానం అమలు చేస్తే తప్ప అప్పుల నుండి బయటపడలేం

## -ఎమ్మెల్యే బాలరాజుకి విన్నవించిన రైతులు



**జీలుగుమిల్లి, మే19(తెలుగు రాష్ట్రం విలేకరి):**

ప్రభుత్వం సహకార సంఘాల్లో ఓటిఎస్ విధానాన్ని అమలు చేస్తే అప్పుల నుండి బయట పడలేమని, మరణించిన వారి అప్పులను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ పోలవరం నియోజకవర్గంలోని సుమారు 250 మంది రైతులు పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ గోడును ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తీసుకున్న అప్పులకు మించి రెండు మూడు రెట్లు అధికంగా వడ్డీల రూపంలో సొసైటీలకు చెల్లించమని అన్నారు. ఒకపక్క వడ్డీలు కడుతున్న అసలు రుణాలు తీర్చుకోలేక, మరో ప్రక్క కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యేకి తెలిపారు. జాతీయ బ్యాంకులన్ని ఓటీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నాయని, ఇదే విధానాన్ని సహకార సంఘాలు కూడా అమలు చేస్తే తామంతా రుణ విముక్తులమౌతామని తెలిపారు. సొసైటీలకు అప్పుగా ఉన్న చాలామంది రైతులు మృతి చెందారని, ఇలా మృతి చెందిన వారి అప్పులు కూడా ప్రభుత్వం రద్దు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ రైతులంతా తన దృష్టి తీసుకొచ్చిన సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అంతేకాకుండా సొసైటీలపై వస్తున్న ఆరోపణలపై సమీక్ష నిర్వహించి, రైతులపై ఒత్తిడి లేకుండా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. అప్పులు చెల్లించలేని రైతుల గురించి గ్రామాల్లో ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, రైతులు యాండ్ర రాజేంద్ర, గన్నిన సూర్యచంద్రరావు, తూంపాటి దుర్గారావు, పూసం చుక్కమ్మ, తుష్టి నాగు, వసుమర్తి భీమేశ్వరరావు, పైదా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ పోరాటం భవిష్యత్ తరాల కోసం

## -ఏయమ్ హెచ్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు



**చింతూరు, మే 19(తెలుగు రాష్ట్రం విలేకరి):**

ఈ రోజు ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు రంపచోడవరం ఐ టి డీ ఏ ఎదురుగా ఏ జే ఎ సి చేస్తున్న 5 వ రోజు రిలే దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలపడం జరిగింది. అనంతరం దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలని అప్పటి వరకు ఈ ఉద్యమము కొనసాగుతుంది అని అన్నారు ఏ జె ఏ సి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ దీక్షలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు ఈ దీక్షలకు సంఘీభావంగా ఫార్మసీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి మార్గదర్శి, లాబ్ టెక్నిషియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పండు దొర, సభ్యులు భవాని, బాలు తదితరులు పాల్గొన్నారు.

# పంజాబ్ రూపురేఖల్నే మార్చి..

## 11 ఏళ్ల తర్వాత ప్లేఆఫ్స్‌నకు చేర్చి.. ఒకేఒక్కడు శ్రేయస్

**ఎలాంటి అంచనాలు లేని జట్టు అది. నిలకడలేమికి మారు పేరుగా ఉండేది. ఎప్పుడూ పేలవ ప్రదర్శనతో కనీసం ప్లేఆఫ్స్ వరకు రాకుండానే వెనుదిరుగుతుండేది. అలాంటి జట్టు అద్భుత ప్రదర్శనతో 11 ఏళ్ల తర్వాత ప్లేఆఫ్స్‌లోకి సగర్వంగా అడుగుపెట్టింది. అందుకు కారణం ఒకే ఒక్కడు.. అతడే శ్రేయస్ అయ్యర్ ఆ జట్టే పంజాబ్ కింగ్స్**



తరచూ కెప్టెన్లు మారుతుండే జట్టు పంజాబ్. అలాంటి జట్టులోకి వచ్చాడు శ్రేయస్ అయ్యర్. సారథ్య బాధ్యతలు చేపట్టి.. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆ జట్టు రూపురేఖలనే మార్చివేశాడు. అటు బ్యాట్‌తో, ఇటు కెప్టెన్సీతో ఆకట్టుకుంటూ.. తన జట్టును అద్భుతంగా ముందుకు నడిపిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచ్‌ల్లో 8 విజయాలను నమోదు చేసింది ఆ జట్టు.

### సారథిగా ఒకేఒక్కడు..

ఇక ఏ జట్టుకు సారథ్య బాధ్యతలు వహించినా.. తనదైన వ్యూహాలతో అద్భుతంగా ముందుకునడిపిస్తాడు శ్రేయస్. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకూ మూడు వేర్వేరు జట్లకు సారథ్యం వహించి వాటిని ప్లేఆఫ్స్‌నకు చేర్చిన ఏకైక కెప్టెన్ శ్రేయస్ అయ్యరే. గతంలో దిల్లీని కూడా తన సారథ్యంలోనే ప్లేఆఫ్స్‌నకు చేర్చాడు. అతడి సత్తాను చెప్పేవి ఈ గణాంకాలే. గత సీజన్‌లో కోల్‌కతాకు సారథ్యం వహించి.. ఆ జట్టుకు టైటిల్ కూడా అందించాడు. అయినప్పటికీ ఆ జట్టు వదులుకోవడంతో.. మెగా వేలంలో పంజాబ్ రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. జట్టును అద్భుత రీతిలో నడిపిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.

### బ్యాట్‌తోనూ..

సారథి అంటే జట్టును నడిపించడమే కాదు.. జట్టు విజయాల్లో తనవంతు పాత్ర కూడా ఉండాలి. ఈ విజయ సూత్రాన్ని నిరూపిస్తూ ముందుకుసాగుతున్నాడు శ్రేయస్. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అయ్యర్.. ఇప్పటివరకూ 435 పరుగులు చేశాడు. అందులో ఒక ఇన్నింగ్స్‌లో శతకానికి(97లి) చేరువగా వచ్చాడు. ఆ మ్యాచ్‌లో సెంచరీ చేసే అవకామున్నా.. జట్టు కోసమే నిలబడ్డాడు.

### అనుకున్న గుర్తింపు దక్కిందా..?

కోల్‌కతాను విజేతగా నిలబెట్టినా శ్రేయస్‌కు రావాల్సిన గుర్తింపు రాలేదనే విమర్శలూ ఉన్నాయి. ఎందుకంటే.. ఆ జట్టు అతడిని ఆ తర్వాత వదిలేసుకుంది. కోల్‌కతా టైటిల్ విజయంలో అప్పటి మెంటార్ గౌతమ్ గంభీర్‌కే ఎక్కువ క్రెడిట్ దక్కిందనే వాదనలూ ఉన్నాయి. ఈ అంశం పైనే తాజాగా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందించాడు. "గత సీజన్‌లో కోల్‌కతాను టైటిల్ విజేతగా నిలబెట్టినా.. శ్రేయస్‌కు తగిన గుర్తింపు లభించలేదు. ఆ ప్రశంసలు మరొకరికి దక్కాయి. జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించేది కెప్టెనే. డగౌట్‌లో కూర్చున్న వ్యక్తి కాదు. ఈ ఏడాది చూడండి.. శ్రేయస్‌కు మంచి పేరు వస్తోంది. కోచ్ రిక్కీ పాంటింగ్‌కు ఎవరూ క్రెడిట్ ఇవ్వడం లేదు" అంటూ గావస్కర్ పరోక్షంగా అప్పటి కోల్‌కతా మెంటార్ గౌతమ్ గంభీర్‌పై వ్యాఖ్యలు చేశాడు.

### ఛాంపియన్స్ ట్రోఫీలోనూ..

ఐపీఎల్‌లోనే కాదు.. గత ఛాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్ఇండియా తరపున అద్భుత ప్రదర్శన చేశాడు శ్రేయస్. టీమ్ఇండియా టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. మరి శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో పంజాబ్ తొలిసారి టైటిల్ గెలవాలని ఆ జట్టు అభిమానులు కోరుకుంటున్నారు.

# ఆసియా కప్‌నకు దూరమంటూ వార్తలు.. ఖండించిన బీసీసీఐ




ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఏడాది జరగనున్న ఆసియా కప్ టోర్నీ నుంచి టీమ్ఇండియా వైదొలగాలని నిర్ణయించినట్లు వార్తలొచ్చాయి. అయితే, వీటిని బీసీసీఐ ఖండించింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే పురుషుల ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీమ్ఇండియా ఆడే అవకాశాలు లేవని ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి. అంతేకాకుండా జూన్ నెలలో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుంచి కూడా వైదొలగాలని బీసీసీఐ నిర్ణయించినట్లు వార్తలొచ్చాయి. ప్రస్తుతం ఆసియా క్రికెట్ మండలికి పాకిస్థాన్ మంత్రి, పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ అధ్యక్షుడిగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో నిజం లేదని బీసీసీఐ తాజాగా స్పష్టం చేసింది.

'ఈ రోజు ఉదయం నుంచి ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టోర్నీల్లో పాల్గొనకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్టు జరుగుతున్న ప్రచారం మా దృష్టికి వచ్చింది. అటువంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఇప్పటి వరకు బీసీసీఐ ఏసీసీ ఈవెంట్‌ల గురించి చర్చించలేదు' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

# టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు గిల్‌కు అప్పగిస్తే..

## గుజరాత్ కోచ్ స్పందనిదే!

**టీమ్ఇండియా టెస్టు కెప్టెన్సీ విషయంపై చర్చ కొనసాగుతోంది. రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను ఎవరు ముందుండి నడిపిస్తారనేది ఆసక్తికరంగా మారింది. టెస్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, బుమ్రా పేర్లు వినిపిస్తున్నాయి. అయితే.. బుమ్రా తరచూ గాయాలబారిన పడుతుండటంతో.. గిల్ ఈ రేసులో కాస్త ముందున్నాడు. మరోవైపు ఈ ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ను అతడు అద్భుతంగా నడిపిస్తున్నాడు.**




ఈ నేపథ్యంలో గిల్‌కు టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే ఎలా రాణిస్తాడనే ప్రశ్నకు గుజరాత్ అసిస్టెంట్ కోచ్ ఆశిష్ కపూర్ స్పందించాడు. "గిల్‌ను నేను అండర్-16 రోజుల నుంచి చూస్తున్నాను. అతడు అందరికంటే ఎక్కువ ఆలోచిస్తాడు. తన గురించే కాకుండా.. పది మంది ఆటగాళ్ల గురించి కూడా ఆలోచిస్తాడు. మ్యాచ్‌లు ఎలా గెలవాలో ప్రణాళికలు వేస్తాడు" అని తెలిపాడు.

### దెబ్బకు మూడు బెర్తులు.. ప్లేఆఫ్స్‌లో గుజరాత్, బెంగళూరు, పంజాబ్

పరిమిత అనుభవం ఆధారంగా కెప్టెన్సీ సామర్థ్యాలను అంచనా వేయడం కష్టమని కపూర్ పేర్కొన్నాడు. "2007లో ధోనీకి ప్రపంచకప్ బాధ్యతలు అప్పగించినప్పుడు.. అతడికి గతంలో కెప్టెన్సీ చేసిన అనుభవం కూడా లేదు. కానీ.. అతడు ప్రపంచంలోనే అత్యుత్తమ సారథిగా ఎదుగుతాడని అప్పట్లో ఎవరూ ఊహించి ఉండరు. దీంతో ఏ ఆటగాడిపైనైనా జడ్జిమెంట్ ఇచ్చే ముందు.. అతడిని కొంతకాలం పాటు గమనించాలి. శుభ్‌మన్ విషయంలో ఇప్పుడే చెప్పడం కష్టం" అని పేర్కొన్నాడు.

# కేఎల్‌రాహుల్‌పై విమర్శలు సరికాదు..

## ఐపీఎల్ మాజీ కోచ్




గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ సెంచరీతో ఆకట్టుకున్నా దిల్లీ క్యాపిటల్స్ ఓటమిపాలైంది. ఆ జట్టు నిర్దేశించిన 200 లక్ష్యాన్ని గుజరాత్ ఓపెనర్లు వికెట్ నష్టపోకుండా ఛేదించారు. అయితే.. కేఎల్ రాహుల్ ఆడిన తీరు గొప్పగా ఉందని.. అయితే అతడికి దక్కాల్సిన గుర్తింపు రాలేదని ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ మాజీ కోచ్ టామ్ మూడీ అన్నాడు. కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌తోనే దిల్లీ స్కోరు 200 పరుగుల వరకు చేరుకోగలిగిందని పేర్కొన్నాడు. ఇక అతడిపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్ చుట్టూ విమర్శలు ఎప్పుడూ అసాధారణంగానే కనిపిస్తాయి. అందరూ అనుకున్నదాని కంటే అతడు గొప్ప ఆటగాడని భావిస్తాను. అతడు ఆడిన తీరు చూస్తుంటే.. అదో గొప్ప ఇన్నింగ్సే అని నేను అనుకుంటున్నాను. అయితే.. జట్టు 220 పరుగులు చేసి ఉండాల్సింది. ఆ అవకాశం ఉన్నా చేయలేకపోయారు. క్రికెట్ అనేది వ్యక్తిగత ఆట కాదు. అందరూ సమష్టిగా రాణించాల్సి ఉంటుంది. మిడిల్ ఓవర్లలో కేఎల్ రాహుల్ కొన్ని బంతులే ఎదుర్కొన్నాడు. దీంతో కొద్దిగా లయను కోల్పోయాడు" అని టామ్ మూడీ పేర్కొన్నాడు. దెబ్బకు మూడు బెర్తులు.. ప్లేఆఫ్స్‌లో గుజరాత్, బెంగళూరు, పంజాబ్ ఇక ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్‌లతో 112 పరుగులు చేశాడు. మరోవైపు గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్, గిల్ చెలరేగి ఆడటంతో.. 10 వికెట్ల తేడాతో దిల్లీ ఓటమిపాలైంది.

# సర్ఫరాజ్ 10 కేజీలు తగ్గి..

ముంబయి: భారత టెస్టు జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్న బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాడు. ఇంగ్లాండ్ పర్యటించే భారత్-ఎ జట్టులో చోటు దక్కించుకున్న అతడు.. అధిక బరువును తగ్గించుకునే పనిలో పడ్డాడు. సర్ఫరాజ్ ఇప్పటికే 10 కేజీల బరువు తగ్గాడు. ప్రత్యేక ఆహార నియమాలతోనే అతనిలా మారాడు. ఉడకబెట్టిన కూరగాయలు, చికెన్ మాత్రమే తింటున్న సర్ఫరాజ్.. గణనీయంగా బరువును తగ్గించుకున్నాడు. ఇంగ్లాండ్ పర్యటన ఆరంభం అయ్యే నాటికి మరింత ఫిట్‌నెస్ సాధించాలని పట్టుదలగా ఉన్నాడు. ఫిట్‌నెస్‌తో పాటు ఆట మెరుగుపరుచుకోవడం పైనా ఈ బ్యాటర్ దృష్టి సారించాడు. తండ్రి నౌషద్‌ఖాన్ పర్యవేక్షణలో ఆఫ్‌సైడ్ ఆవల పడే బంతులను ఎక్కువ సాధన చేస్తున్నాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో 150 పరుగులు చేసి సత్తా చాటిన సర్ఫరాజ్.. తర్వాతి రెండు టెస్టుల్లో విఫలమయ్యాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం భారత జట్టుకు ఎంపికైనా.. ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశాన్ని దక్కించుకోలేకపోయాడు. ఆసీస్‌లో పర్యటనలో ప్రాక్టీస్ సెషన్లో సర్ఫరాజ్ పక్కటెముకలకు గాయం అయింది. దీంతో రంజీ ట్రోఫీలోనూ ఆడలేదు. ఐపీఎల్‌లో ఏ జట్టూ అతణ్ని తీసుకోలేదు.



CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్‌కు కరోనా పాజిటివ్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించిన నమత్ర సోదరి..!



ప్రపంచవ్యాప్తంగా మళ్లీ కరోనా మహమ్మారి విజృంభిస్తున్నది. ఆసియావ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. హాంకాంగ్, సింగపూర్, చైనా, థాయిలాండ్‌లో కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ సైతం కొవిడ్ పాజిటివ్‌గా తేలారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తనకు కొవిడ్ పాజిటివ్ వచ్చిందని.. అందరూ జాగ్రత్తగా ఉండాలని.. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో సూచించారు. టాలీవుడ్ నటుడు మహేశ్ బాబు భార్య నమత్రా శిరోద్కార్ సోదరియే శిల్పా శిరోద్కర్. కొవిడ్ పాజిటివ్‌గా తేలిందని శిల్పా శిరోద్కర్ వెల్లడించిన నేపథ్యంలో బాలీవుడ్‌ను షాక్‌కు గురి చేస్తుంది. పలువురు అభిమానులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా.. శిల్పా శిరోద్కర్ పలు బాలీవుడ్ సినిమాల్లో నటించారు.టీవీ సీరియల్స్‌లోనూ నటిస్తున్నారు. ఇటీవల రియాలిటీ షో బిగ్ బాస్ 18లో పాల్గొంది. గ్రాండ్‌ఫినాలే వీక్‌లో ఎనిమిలేట్ అయ్యింది. ఫైనలిస్ట్ అయ్యే అవకాశం త్రుటిలో చేజారింది. బిగ్‌బాస్‌తో శిల్పా లపు ప్రాజెక్టులు, ఎండార్స్‌మెంట్లతో ఫుల్ బిజీ అయ్యారు. ఇదిలా ఉండగా.. గత కొద్దికాలంగా కొవిడ్ మహమ్మారితో జనమంతా ఊపిరిపీల్చుకుంటుండగా.. ప్రస్తుతం మళ్లీ విజృంభిస్తున్నది. ఇంతకు ముందు ఆస్ట్రేలియాకు చెందిన బ్యాటర్ ట్రావిస్ హెడ్ సైతం కొవిడ్ బారినపడ్డ విషయం తెలిసిందే. వరుసగా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జనమంతా ఆందోళనకు గురవుతున్నారు. అయితే, కొవిడ్‌తో పెద్దగా ఇబ్బంది లేదని.. సాధారణంగా ఫ్లూ మాదిరిగానే సోకుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. టీకా ప్రభావం తగ్గిన నేపథ్యంలో కొత్త కేసులు నమోదవుతున్నాయి.. తప్పనిసరిగా బూస్టర్ డోస్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# త్వరలోనే పెళ్లిపీటలెక్కనున్న విశాల్.. పెళ్లి కూతురు టాలీవుడ్ హీరోయినే..!





ప్రముఖ నటుడు విశాల్ త్వరలో పెళ్లిపీటలెక్కనున్నాడు. ప్రస్తుతం ఆయన పెళ్లి టాపిక్ టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పెళ్లి వార్తలను విశాల్ సైతం ధ్రువీకరించిన విషయం తెలిసిందే. తాజాగా నటుడు చూసుకోబోది ప్రముఖ హీరోయిన్ సాయి ధన్సికనేనని సమాచారం. గత కొంతకాలంగా ఇద్దరు ప్రేమలో ఉన్నారని.. పెళ్లికి ఇటీవల రెండు కుటుంబాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. త్వరలోనే వివాహబంధంతో ఒక్కటి కాబోతున్నట్లుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటి వరకు విశాల్ గానీ, ధన్సిక కానీ స్పందించలేదు.ఇదిలా ఉండగా.. ఇటీవల నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో విశాల్ మీడియాతో మాట్లాడారు. క్రమంలో పెళ్లిపై ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నానని.. జీవిత భాగస్వామిని సైతం గుర్తించానని.. పెళ్లి విషయంలో చర్చలు జరుగుతున్నట్లు విశాల్ తెలిపాడు. ఇది ప్రేమ పెళ్లేనని.. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నట్లు తెలిపాడు. గతంలో నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన తర్వాత పెళ్లి చేసుకుంటానని విశాల్ ప్రకటించిన విషయం విధితమే. ఇచ్చిన మాట ప్రకారం భవన నిర్మాణం పూర్తి కావడంతో పెళ్లికి రెడీ అయ్యారు. ఇక విశాల్ పెళ్లి వార్తలు కొత్తేం కాదు. గతంలో పలువురు హీరోయిన్లను పెళ్లి చేసుకోబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి.

# శివుడిని శివయ్యా.. అని పిలిస్తే రాడు..మనోజ్ కామెంట్స్ వైరల్



మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించారు. ఐతే, ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ను ఏలూరు లో గ్రాండ్ గా లాంచ్ చేశారు. ఈ వేడుకలో మంచు విష్ణు పై మంచు మనోజ్ మాట్లాడిన పరోక్ష మాటలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఇంతకీ, మనోజ్ ఏం మాట్లాడారు అంటే.. ‘శివుడిని శివయ్యా.. అని పిలిస్తే రాడు. ఆయన్ని మనసారా తలచుకుంటే మా దర్శకుడి రూపంలోనో.. మీ అందరి రూపంలో వస్తాడు’ అంటూ మనోజ్, విష్ణు పై పరోక్ష విమర్శ చేశారు.మనోజ్ ఇంకా మాట్లాడుతూ.. ‘ఈ మధ్యకాలంలో ఎన్నో జరిగాయి. ఎన్నో చూశాను. కట్టుబట్టలతో రోడ్డు మీదకు తెచ్చారు. నేను ఊరు వెళ్లొచ్చేసరికి నా పిల్లల వస్తువులతో సహా అన్నీ రోడ్డు మీద పెట్టారు. బయటకు వెళ్లడానికి కార్లు లేకుండా తీసుకెళ్లిపోయారు. కానీ.. నాకు ఆ శివుడు ఫ్యాన్స్ రూపంలో వచ్చి.. ఇంటి బయట 20 కార్లు పెట్టించాడు. వాళు ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. నాకు ఎవరి మీద కోపం రావడం లేదు. అది నా బలహీనతో.. వారి బలమో అర్థం కావట్లేదు. నా కట్టె కాలేవరకూ నేను మోహన్‌బాబు కుమారుడినే. చిన్నప్పటినుంచి నీతి, న్యాయం వైపు నిలబడాలని నూరిపోసి పెంచారు. ఇప్పుడు అదే పని చేస్తుంటే తప్పు అంటున్నారు” అని మంచు మనోజ్ ఎమోషనల్ అవుతూ చేసిన కామెంట్స్ ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారాయి.


# మాస్టర్ భరత్‌కు మాతృ వియోగం





హైదరాబాద్: చైల్డ్ ఆర్టిస్ట్ భరత్ ఇంట్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మాస్టర్ భరత్‌కు మాతృ వియోగం కలిగింది. ఆదివారం రాత్రి మాస్టర్ భరత్ తల్లి కమల హాసిని కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా భరత్ తల్లి కమల హాసిని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి చెన్నైలో సడెన్ గా ఆమెకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యుల సమాచారం. దీనిపై భరత్ అధికారికంగా ప్రకటించలేదు.

# పడిపోయిన చిత్రం మళ్లీ పైకి లేచిందిలా



మూడు దశాబ్దాల తర్వాత కమల్ హాసన్- మణిరత్నం కాంబినేషన్లో సినిమా ప్రకటన ఒక్కసారిగా అంచనాలు పీక్స్ కి వెళ్లాయి. అందుకు తగ్గట్టు కమల్ పాత్రపై రిలీజ్ చేసిన గ్లింప్స్ ఆసక్తిని రెట్టింపు చేసాయి.నాయకుడు’ తర్వాత ఇద్దరు మరో పెద్ద అద్భుతం చేయబోతున్నారంటూ ప్రచారం మొదలైంది. అటుపై షఉటింగ్ మొదలైన తర్వాత సినిమా గురించి ఎలాంటి హడావుడి కనిపించలేదు.దీంతో మొదలైన అంచనాలు ఒక్కసారిగా డౌన్ అయ్యాయి. అప్ డేట్ కూడా లేకపోవడంతో థగ్ లైఫ్ పై ఎక్కడా ఎలాంటి చర్చకు తావు లేకుండా పోయింది. చిత్రీకరణ పూర్తయిన అనంతరం కూడా ఎలాంటి అప్ డేట్ అందించలేదు. రిలీజ్ విషయంలో కూడా క్లారిటీ లేకపోవడంతో? బజ్ మరింత డౌన్ అయింది. అయితే ఒక్క ట్రైలర్ తో ‘థగ్ లైఫ్’ ని మళ్లీ అలా పైకి లేపారు. ట్రైలర్ కూడా ఎలాంటి అంచనాలు లేకుండానే రిలీజ్ అయింది. కానీ రిలీజ్ తర్వాత సీన్ మొత్తం మారిపోయింది. ట్రైలర్ ప్రేక్షకుల్ని థ్రిల్ చేసింది.రేర్ కాంబినేషన్ చేతులు కలిపితే ఎలా ఉంటుందో చిన్న ట్రైలర్ తోనే ప్రూవ్ చేసారు. కమల్ రోల్... అందులో ఎమోషన్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. కమల్ –శింబు మధ్య ఘర్షణ వాతావరణం ఎంతో బలంగా కనిపిస్తుంది. నాజర్, జోజు జార్జ్ వంటి సహాయ నటులు కూడా తమ ఆసక్తికరమైన పాత్రలతో బలమైన ముద్ర వేశారు. గ్యాంగ్ స్టర్ డ్రామాలో బలమైన ఎమోషన్ కూడా హైలైట్ అవుతుంది.అన్నింటిని మించి కమల్ –అభిరామి మధ్య లిప్ లాక్ పెను సంచలనమే అయింది. విమర్శలు వ్యక్తమైనప్పటికీ ఆ విమర్శలే కోట్ల రూపాయల పబ్లిసిటీని తెచ్చిపెట్టాయి. కమల్ అభిమానుల ఎటాకింగ్ కూడా సినిమాకు కలిసొచ్చింది. ఈ అంశాలన్ని థగ్ లైఫ్ ని ట్రెండింగ్ లో నిలిచేలా చేసాయి. దీంతో పడపోయిన అంచనాలు మళ్లీ మొదలయ్యాయి. థగ్ లైఫ్ ని జూన్ 5న రిలీజ్ చేస్తున్నారు. పోటీగా సినిమాలు కూడా లేవు. దీంతో ఈసినిమాకు భారీ ఓపెనింగ్స్ కి తిరుగులేదు. పాజిటివ్ టాక్ తెచ్చుకుంటూ వసూళ్ల పరంగానూ చూసే పనిలేదు.

# మంచు మనోజ్‌పై తన దైన శైలిలో స్పందించిన నారా రోహిత్





నారా రోహిత్ ఎమోషనల్ పోస్ట్: “ఏదైనా.. ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటాను బాబాయ్!” ‘భైరవం’ ట్రైలర్ ఈవెంట్ ఆదివారం ఏలూరులో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సందర్భంగా మంజు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అయితే ఈవెంట్ తర్వాత నటుడు నారా రోహిత్ చేసిన ఓ ఎమోషనల్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ‘ఎక్స్’ (గతంలో ట్విట్టర్) వేదికగా మంచు మనోజ్‌ను ఉద్దేశించి రోహిత్ చేసిన భావోద్వేగపూరిత ట్వీట్ నెటిజన్ల మనసుల్ని తాకింది.“నిన్న ఏలూరులో ‘భైరవం’ ఈవెంట్‌తో అద్భుతమైన సాయంత్రాన్ని ఆస్వాదించాం. ఈ ఈవెంట్‌ను ఎంతో ప్రత్యేకంగా మార్చినందుకు ఏలూరు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో బాబాయ్ మంచు మనోజ్ ప్రత్యేకంగా నిలిచారు. ఆయన ప్రసంగం శక్తివంతమైనది, భావోద్వేగభరితమైనది, హృదయాన్ని తాకినది. ఏది ఏమైనా, విషయం ఏదైనా.. నేను ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటాను బాబాయ్. లవ్ యూ!” అంటూ రోహిత్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339